సాక్షి ప్రకాశం

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



ఆత్మగౌరవం శూన్యం.. అవమానమే నిత్యం!

గత ప్రభుత్వంలో ప్రజలకు ఉన్నత సేవలు అందించిన సచివాలయ ఉద్యోగులు.. ప్రస్తుతం అవమానాలకు గురవుతున్నారు. - 8లో..



పట్టుకుంటారు.. వదిలేస్తారు

అధికారుల అండదండలతో సింగరాయకొండలో ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల సహకారంతో పచ్చనేతలు రెచ్చిపోతూ ఇసుక దందా చేస్తున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33.8/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యునిగా ఆదిమూలపు



సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ అత్యున్నత స్థాయి రాజకీయ నిర్ణయాత్మక కమిటీ (పీఏసీ) సభ్యునిగా మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. దీనిపై ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ అయిన పీఏసీలో సభ్యునిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విధివిధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణను ఈ కమిటీ నిర్ణయిస్తుందని, ఈ కమిటీలో జగనన్నతో పాటు మరో ఆరుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. దళితుడిని అయిన తనకు అత్యున్నత కమిటీలో స్థానం కల్పించడం జగనన్న ఔదార్యానికి నిదర్శనమని, దళితులకు పెద్దపీట వేస్తారని మరోసారి ఆయన నిరూపించుకున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ అవినీతి, అబద్ధపు హామీలు, ప్రజావ్యతిరేక పాలనను ఎండగడుతూ తనపై జగనన్న ఉంచిన నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా పనిచేస్తానన్నారు. 2029 ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని సురేష్ తెలిపారు.

ఒంగోలు ఆర్డీఓగా లక్ష్మీప్రసన్న

- కనిగిరి ఆర్డీఓగా కేశవర్ధన్‌రెడ్డి

ఒంగోలు అర్బన్: ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా కె.లక్ష్మీప్రసన్నను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న జీవీ సుబ్బారెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అదేవిధంగా కనిగిరి డివిజన్ ఆర్డీఓగా జి.కేశవర్ధన్‌రెడ్డిని నియమించారు. ప్రస్తుతం కనిగిరి ఆర్డీఓగా ఉన్న జాన్ ఇర్విన్‌ను బదిలీ చేశారు.

29న ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లా క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-17 జిల్లా క్రీడా జట్ల ఎంపికను ఈ నెల 29వ తేదీ నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శర్మా కాలేజీ ఎదురుగా ఉన్న భారత జాతీయ వ్యాయామ కళాశాలలో పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడా జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో షూటింగ్, సమావేశం ఉన్నత పాఠశాలలో ఆర్చరీ క్రీడా జట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపికను స్థానిక గద్దలగుంటలోని ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పీఈటీ/పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్‌లైన్ ఎంట్రీ చేయించి మాన్యువల్ ఎంట్రీఫాంతో ఎంపికకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అండర్-17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో నిర్వాహకులకు సంప్రదించాలని కోరారు.

సొంత శాఖలో వారే కుట్ర చేశారా?

ఒంగోలు టౌన్: జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్‌పై దాడి చేసింది సొంత శాఖలో పనిచేసేవారేనా అంటే.. అవుననే సమాధానం వస్తోంది. కీలకమైన ఆధారాలతో ఒంగోలుకు చెందిన ఆరుగురిని బుధవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించి అసలు విషయం రాబట్టారు. డీసీఏవో రాజశేఖర్ గత ఆరేళ్లుగా ఇక్కడ ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ఆయన జిల్లా సహకార ఇన్‌చార్జి అధికారిగా కూడా పనిచేశారు. ఆ సమయంలో జిల్లాలో కొన్ని సంఘాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. పొదిలి, కొనకనమిట్ల, పల్లామల్లి, కారుమంచి, పొన్నలూరు, కొమరోలు తదితర డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఏకంగా 11 విచారణ కమిటీలు వేశారు. 3 కోట్ల రూపాయలకుపైగా రికవరీలు చేశారు. దీంతో కొందరు ఉద్యోగులకు రాజశేఖర్ వైఖరి మింగుడు పడలేదు. ఆయన వ్యవహారశైలి, ఏదైనా అక్రమాలకు పాల్పడుతున్నరా, ఎవరెవరితో ఎలాంటి సంబంధాలు ఉన్నాయన్న విషయాలపై రెక్కీ చేయడం మొదలెట్టారు. ఈ విషయం తెలుసుకున్న రాజశేఖర్ సదరు ఉద్యోగులపై సస్పెండ్ వేటు వేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ఉద్యోగులు, ఈయన వలన నష్టపోయిన ఇతర వ్యక్తులతో కలిసి దాడికి పాల్పడ్డారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. శ్రీనివాస్, అజయ్, నిఖిల్, శ్రీకాంత్, సుభాష్, కార్తీక్‌లను అరెస్టు చేశారు.

కూటమిలో ఫైటింగ్

జిల్లా కూటమిలో కుంపట్లు మొదలైపోయాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలో చేరికతో లుకలుకలు మొదలయ్యాయి. దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం వాడీవేడిగా సాగుతోంది. బాలినేని ఫ్లెక్సీల చించివేతతో వివాదం మరింతగా ముదిరింది. ఇక జనసేనలోని రెండు వర్గాల్లో ఒక వర్గం బాలినేని రాకను ఆహ్వానిస్తుండగా, మరో వర్గం తీవ్రంగా విభేదిస్తోంది. రానున్న రోజుల్లో అధికార కూటమిలో రాజకీయం మరింత రసకందాయంలో పడనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



- బాలినేని జనసేన ప్రవేశాన్ని జీర్ణించుకోలేకపోతున్న దామచర్ల
- ఇద్దరి మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం
- ఫ్లెక్సీల చించివేతతో రాజుకున్న రాజకీయ చిచ్చు
- బాలినేని రాకను వ్యతిరేకిస్తున్న రియాజ్ వర్గం
- బాలినేనితో జనసేన బలోపేతమంటున్న రాయపాటి అరుణ
- దామచర్ల, బాలినేని వర్గాలుగా విడిపోయిన జనసేన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలో చేరడం అధికార కూటమిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. బాలినేని చేరికను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జీర్ణించుకోలేకపోతున్నారు. తన అనుచరవర్గంతో రోజుకో రకంగా ఆరోపణలు చేయిస్తున్నారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికే బాలినేని జనసేనలో చేరుతున్నారని, నిన్ను పవన్ కళ్యాణ్ కూడా కాపాడలేడని దామచర్ల చేస్తున్న వ్యాఖ్యలపై జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దామచర్ల స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జనసేనలో జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. అదికాస్తా ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంది. దామచర్లకు మద్దతుగా రియాజ్ మాట్లాడుతున్నారు. గతంలో బాలినేని మీద చేసిన ఆరోపణలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని చెబుతున్నారు. అరుణ మాత్రం బాలినేని రాకతో జిల్లాలో జనసేన మరింత బలోపేతం అవుతుందని చెప్పడం గమనార్హం. నిన్నమొన్నటి వరకు రియాజ్, అరుణ వర్గాలుగా కొనసాగిన జిల్లా జనసేన.. ఇక నుంచి దామచర్ల, బాలినేని వర్గాలుగా విడిపోనుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

తగ్గేదే లేదంటున్న దామచర్ల...

బాలినేనిని జనసేన పార్టీలో చేర్చుకోవడాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో పాటు తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దామచర్ల ఒక అడుగు ముందుకేసి ఏకంగా పవన్ కళ్యాణ్‌ను సైతం విమర్శిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు కూడా కాలేదని, అంత తొందరపాటు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. నేను ఐదుసార్లు గెలిచాను, తోపును అనుకుని అధికారంలో ఉన్నప్పుడు బాలినేని చేసిన పాపాలకు శిక్ష అనుభవించాల్సిందేనంటూ మండిపడుతున్నారు. ఏ పార్టీలోకి వెళ్లినా అతన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. నిజానికి బాలినేని తెలుగుదేశం పార్టీలో చేరడం లేదు. జనసేనలో చేరుతున్నారు. అయితే దామచర్ల ఎందుకంతగా స్పందిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. సీనియర్ నాయకుడైన బాలినేని జనసేనలోకి వస్తే తన ఆధిపత్యానికి ఎక్కడ గండిపడుతుందో అనే ఆందోళనతోనే దామచర్ల ఎదురుదాడికి దిగుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఏదో ఒకటి చేయడం ద్వారా బాలినేనిని అడ్డుకోకపోతే భవిష్యత్తులో ఒంగోలు సీటుకు ఎసరొచ్చే ప్రమాదం ఉందన్న భయంతోనే దామచర్ల రెచ్చిపోతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నేను కాంప్రమైజ్ అయ్యే మనిషిని కాను...

బాలినేని సైతం నేను కాంప్రమైజ్ అయ్యే మనిషిని కానంటూ చెప్పడం భవిష్యత్తు రాజకీయాలకు అద్దం పడుతుందని చెప్పవచ్చు. గత శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన బాలినేని ఫ్లెక్సీలను తొలగించడంపై ఆయన స్పందించి తీరది. ఆ తర్వాత మంగళవారం లాయరుపేటలోని సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించడం జరిగింది. బుధవారం నగరంలోని లాయరుపేట, కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండు సెంటర్, సీవీఎన్ రీడింగ్ రూం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించేసి సవాల్ విసిరారు. దీంతో బాలినేని వర్గం మండిపడుతోంది. బాలినేని సైతం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ని కలిసి వినతిపత్రం అందించడమే కాకుండా ఫ్లెక్సీలను చించిన నిందితులను శిక్షించాలని కోరారు. మంగళగిరిలో జనసేనలో చేరిన బాలినేని.. ఆ తర్వాత పవన్ కళ్యాణ్‌తో జరిగిన చర్చల్లో ఫ్లెక్సీల ప్రస్తావన తెచ్చినట్లు సమాచారం. దామచర్ల వ్యాఖ్యలను కూడా ఆయన పవన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిని బట్టి చూస్తే బాలినేని కూడా దామచర్లతో కాంప్రమైజ్ కావాలని భావించడం లేదని తెలుస్తోంది.


ఫైటింగ్ మొదలైనట్టేనా...

బాలినేని రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న దామచర్ల తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే బాలినేని అనుచరులను ముప్పతిప్పలు పెట్టేందుకు పాత కేసులను తిరగదోడి కొత్త కేసులను బనాయిస్తున్నారు. సుబ్బారావు గుప్తా మీద దాడికి పాల్పడిన సుభాని, షేక్ సైదాలను నాలుగు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇవ్వడం గురించి రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బాలినేని మరో అనుచరుడిని కూడా త్వరలోనే పోలీసులు అదుపులోకి తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అరెస్టుల భయంతో సదరు నాయకుడు బాలినేనిని విడిచిపెట్టకుండా అంటిపెట్టుకుని తిరుగుతున్నాడని చెప్పుకుంటున్నారు. మరికొందరు నాయకులు ఇళ్లు విడిచి, ఊరు విడిచి వెళ్లిపోయినట్లుగా సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను లోతుగా పరిశీలిస్తే రానున్న రోజుల్లో ఫైటింగ్ తీవ్రతరమయ్యే సూచనలకు దర్పణంగా చెప్పవచ్చు.

తుస్సుమన్న ప్రచార డప్పు..!

చేసిందేమీ లేదు.. చెప్పుకోవడానికి అంతకన్నా ఏమీ లేదు.. ఇక ప్రజల ముందుకెళ్లి ఏం మాట్లాడతాం.. సూపర్ సిక్స్ పథకాలేవని అడిగితే ఏం సమాధానం చెబుతాం.. సమస్యలపై నిలదీస్తే తల ఎక్కడ పెట్టుకుంటామని అనుకున్నట్లున్నారు కూటమి పార్టీల నేతలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనకు వంద రోజులు పూర్తయిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఆర్భాటపు ప్రచారం కోసం చేపట్టిన 'మంచి ప్రభుత్వం' కార్యక్రమాలకు డుమ్మా కొట్టారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలలో అక్కడక్కడా టీడీపీ నేతలు మొక్కుబడిగా పాల్గొంటున్నప్పటికీ.. జనసేన, బీజేపీ నేతలు ఎక్కడా కనిపించలేదు. సంక్షేమ పథకాలు అమలు చేయక, అభివృద్ధి జరగకపోవడంతో పాటు స్థానిక సమస్యలపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది. ప్రచార డప్పు తుస్సుమంటోంది.

- జిల్లాలో 'మంచి ప్రభుత్వం' అట్టర్ ఫ్లాప్
- కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన విజయోత్సవాలకు ఆయా పార్టీల నేతలు దూరం
- గొప్పగా చెప్పుకోవడానికి చేసిందేమీ లేకపోవడమే కారణం
- ప్రజావేదిక బహిరంగ సభల్లో కనిపించని జనసేన, బీజేపీ నేతలు
- పరనిందలు, ఉపోద్ఘాతాలకే టీడీపీ నేతలు పరిమితం
- కొత్త పలుకులు కరువు.. స్థానిక సమస్యలపై జనం ఏకరువు
- సంక్షేమం, అభివృద్ధి లేమిపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు



కనిగిరి రూరల్: ఇది మంచి ప్రభుత్వం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబు చేపట్టిన ప్రచార డప్పునకు జిల్లాలో కూటమి పార్టీల నేతలు దూరంగా ఉన్నారు. కొన్నిచోట్ల టీడీపీ నాయకులు తూతూ మంత్రంగా పాల్గొంటుండగా, బీజేపీ, జనసేన నాయకులు పూర్తిగా కనుమరుగయ్యారు. వందరోజుల కూటమి పాలనలో ప్రజలకు ఏమీ చేయలేదనే నగ్నసత్యాన్ని గ్రహించి జనాల్లోకి వెళ్లి పరువు పోగొట్టుకోలేక వారంతా మొహం చాటేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో కూటమిలోని పార్టీలకు చెందిన నాయకుల మధ్య పొరపచ్చాలు, సమన్వయలోపం కూడా కారణంగా తెలుస్తోంది. కారణాలేమైనా కూటమి ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు చేపట్టిన ప్రచార డప్పు కార్యక్రమాలలో ఒకటీరెండుచోట్ల మిత్రపక్షాల చోటా నాయకులు పాల్గొన్నారే తప్ప.. అధిక శాతం టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్న దాఖలాలు లేవు. మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్న కార్యక్రమాలకే జనం కరువవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు.

ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం...

అసలే అరకొరగా జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలలో అత్యధికంగా ఇళ్లకు స్టిక్కర్లు అంటించేందుకు, వాల్ పోస్టర్ ఆవిష్కరణలకే ప్రాధాన్యత ఇచ్చారు. అధికారులు, సచివాలయ సిబ్బంది ఇందులో కీలకంగా వ్యవహరించారు. అనేక చోట్ల అధికార పార్టీ నేతలకు కనీస ప్రాధాన్యత దక్కలేదు. నిర్ణీత తేదీల ప్రకారం నిర్వహించిన ప్రజావేదిక బహిరంగ సభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలే పాల్గొన్నారు. 100 రోజుల పాలనలో చేసిందేమీ లేకపోవడం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరగకపోవడంతో.. పరనిందలు, ఉపోద్ఘాతాలతో మమ అనిపించారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసేందుకే పరిమితమయ్యారు.

ప్రజల ప్రశ్నలకు సరైన సమాధానాలు కరువు...

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ నగదు పెంచి ఇచ్చినట్లు చెబుతున్న నేతలకు.. అనేక చోట్ల కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారు.. రేషన్ కార్డులు కొత్తవి ఎప్పుడిస్తారనే ప్రశ్నలు ఎదురయ్యాయి. త్వరలో పింఛన్లు, రేషన్ కార్డులు ఇస్తామని, ఇసుక పాలసీ విడుదల చేస్తున్నామని చంద్రబాబు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో అడుగు ముందుకు పడలేదు. స్థానికంగా ఎక్కడికక్కడ ఇసుక సమస్య వేధిస్తోంది. వీటిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో నమ్మించి ఓట్లు వేయించుకున్నారని, ప్రధానంగా ఇస్తామని చెప్పిన సూపర్ సిక్స్‌కు కూడా దిక్కులేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎవరైనా అడిగేందుకు సిద్ధమైతే.. పోలీసుల ముందస్తు హెచ్చరికలు.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో నోరు కట్టేస్తున్నారని విమర్శిస్తున్నారు. చెప్పిన పథకాలే అమలుకు నోచుకుని పరిస్థితుల్లో కొత్త పలుకులు, హామీలేమీ లేకపోవడంతో చంద్రబాబు ప్రచార డప్పుకు పూర్తిగా సౌండ్ లేకుండా పోయింది.

స్థానిక సమస్యలపై వినతులు...

కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక సమస్యలపై అధికార పార్టీ నేతలు, అధికారులను ప్రజలు నిలదీశారు. పలు చోట్ల విద్యుత్, నీరు, రోడ్లు, తదితర సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిలో ఓల్టేజీ సమస్య తీర్చాలని డిమాండ్ చేశారు. వాటి పరిష్కారానికి కూడా సరైన హామీని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఇవ్వకపోవడంతో ఇక దేనికోసం ఈ ప్రజావేదిక బహిరంగ సభలు అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



జెడ్పీ బదిలీల్లో స్వామి భక్తి

- అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలకు అధికారుల జీ హుజూర్
- గందరగోళంగా బదిలీల ప్రక్రియ

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ ఉద్యోగుల సాధారణ బదిలీల్లో అధికార పార్టీ నేతల జోక్యం మితిమీరిపోతోంది. హద్దుమీరి ప్రవర్తిస్తూ కార్యాలయంలోనే బెదిరింపులకు దిగుతున్నా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారు. బదిలీలపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సంతకాలు చేసిన ఫైలును సైతం పక్కన పెట్టేశారు. గురువారం కూడా టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు, అనుచరులు ఏకంగా అధికారుల చాంబర్‌లో కూర్చుని ఫైలు సిద్ధం చేశారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పీఏ అయితే.. తాను ఇచ్చిన లిస్ట్ తయారు చేయాల్సిందేనని పట్టుబట్టినట్టు సమాచారం. తాజా పరిణామాలతో జెడ్పీలో బదిలీల పరిస్థితి వివాదాస్పదంగా మారింది.

కొత్త లిస్ట్ తయారు...

జెడ్పీలో ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 392 మందికి స్థానచలనం కల్పించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బదిలీల వ్యవహారాన్ని నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ బదిలీలపై సంతకాలు చేశారు. 22వ తేదీ బదిలీ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. అయితే జెడ్పీలో ఉన్నతాధికారి ఒకరు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేల ప్రాపకం కోసం ఉద్దేశపూర్వకంగా ఆ ఫైలును పక్కనబెట్టినట్టు కొత్త లిస్టు తయారు చేసినట్లు సమాచారం. దీనికోసం నాలుగు రోజులుగా అధికార పార్టీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు జిల్లా పరిషత్ కార్యాలయంలో హల్‌చల్ చేస్తున్నారు. తాము చెప్పినవారికి చెప్పినట్టుగా బదిలీలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి అనుచరులు జెడ్పీ కార్యాలయంలో అసభ్య పదజాలంతో దూషిస్తూ సిబ్బందిని బెదిరింపులకు గురిచేసిన ఘటన విదితమే. గురువారం కూడా సదరు వ్యక్తులతో పాటు ఒక మంత్రి పీఏ ఏకంగా అధికారుల చాంబర్‌లో కూర్చుని బదిలీలకు సంబంధించి కొత్త లిస్ట్ తయారు చేయించినట్లు తెలిసింది. తాము చెప్పినట్టు వింటే భవిష్యత్‌లో మంచి పోస్టింగ్‌లు సైతం ఇప్పిస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'స్వామి' భక్తిని చాటుకునేందుకు మంచి అవకాశం దక్కిందన్న సంతోషంలో బదిలీల ప్రక్రియను సాగదీస్తున్నారనే ఆరోపణలూ వస్తున్నాయి.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం



జెడ్పీ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో చైర్‌పర్సన్‌గా నా ఆదేశాలు పాటిస్తున్నామని చెబుతూనే.. నా అనుమతి లేకుండా రికార్డుల్లో పేర్లు మార్చేస్తున్నారు. జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓలే అధికారులను బదిలీ చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ డైరెక్టర్, కమిషనర్, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

అక్టోబర్ 3 నుంచి టెట్ పరీక్షలు

- జిల్లాలో నాలుగు సెంటర్లు
- రెండు షిఫ్టులలో పరీక్షల నిర్వహణ

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) పరీక్షలను అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర తెలిపారు. ఇందు కోసం జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలోని పెద్దారవీడు మండలం దరిమడుగులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, డాక్టర్ శామ్యూల్ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, స్థానిక మంగమూరు జంక్షన్ సమీపంలోని మామిడిపాలెంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి సోషల్ యాక్షన్ ఇండియా, స్థానిక నెల్లూరు బస్టాండులోని డీఐజీ సొసైటీ కాంప్లెక్స్‌లోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆవరణలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు అభ్యర్థులు గంటన్నర ముందుగా హాజరుకావాలన్నారు. సెల్‌ఫోన్లు, జామెంట్రీ బాక్సులు, బ్యాగులు, ఎలక్ట్రికల్ డివైజ్‌లను అనుమతించడం జరగదన్నారు. ఎవరైనా పీహెచ్‌సీ అభ్యర్థి పేరు స్క్రైబ్ జాబితాలో లేకపోతే లేదా దరఖాస్తులో పీహెచ్‌సీ వివరాలు లేకపోతే వారు జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదిస్తే.. అర్హత మేరకు స్క్రైబ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విజువల్లీ ఛాలెంజ్డ్/ఆర్థోపెడికల్లీ ఛాలెంజ్డ్ (రెండు చేతులు లేనివారు) అభ్యర్థుల విషయంలో నిబంధనల ప్రకారం 50 నిముషాల సమయం అదనంగా కేటాయిస్తామన్నారు. హాల్ టికెట్లపై నో ఫొటోగ్రాఫ్ ఉన్న అభ్యర్థులు తాజాగా వారి ఫొటోగ్రాఫ్‌తో ఉన్న గుర్తింపు కార్డు చూపిస్తే పరీక్షకు అనుమతించడం జరుగుతుందన్నారు. నామినల్ రోల్స్‌లో అభ్యర్థి పేరు/తండ్రి పేరు, లింగం వంటి చిన్న స్పెల్లింగ్ తప్పులను మార్చుకునేందుకు అభ్యర్థులు టెట్ పరీక్ష కేంద్రంలోని డిపార్టుమెంటల్ అధికారులను సంప్రదించాలన్నారు. మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి పరీక్ష ఉన్న ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో టెట్ గ్రీవెన్స్‌సెల్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలుంటే పరీక్షల విభాగం సహాయ కమిషనర్ కె.శివకుమార్ (8125264606/9701000346), అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయభాస్కర్ (8919121853), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ జె.కృష్ణకుమార్ (9246460656)ను సంప్రదించాలని డీఈవో సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తులకు 3 వరకు గడువు పొడిగింపు

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు గడువును అక్టోబర్ 3వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పరీక్షపై పూర్తిగా అవగాహన కల్పించి విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ఈ పరీక్ష డిసెంబర్ 8వ తేదీ దేశవ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి

- టీడీపీ అధికారంలో ఉందనే దౌర్జన్యం
- మాలమహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య



మాట్లాడుతున్న దారా అంజయ్య, బాధితుడు హరిబాబు

ఒంగోలు టౌన్: స్థానిక రత్నమహల్ సెంటర్లో దళిత యువకుడైన మైలవరపు హరిబాబుపై దాడి చేసి, అతడి బుల్లెట్‌ను దౌర్జన్యంగా తీసుకెళ్లిన కమ్మపాలేనికి చెందిన గడ్డం ఉమామహేష్ ముఠాను వెంటనే అరెస్టు చేయాలని మాలమహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని మాల మహానాడు కార్యాలయంలో బాధితుడు హరిబాబు, దళిత నాయకులు కసుకుర్తి రాజు, కాకుమాను రవితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వాసేపల్లి గ్రామానికి చెందిన మైలవరపు హరిబాబు 2011లో ఒంగోలు నగరంలోని కమ్మపాలేనికి చెందిన గడ్డం ఉమామహేష్ దగ్గర నూటికి 4 రూపాయల వడ్డీకి 70 వేల రుపాయలు అప్పు తీసుకున్నాడు. 2014లో హరిబాబు వద్ద ఉన్న బుల్లెట్‌ను ఉమామహేష్ తీసుకున్నాడు. కొద్దిరోజుల తరువాత తన బుల్లెట్ గురించి అడిగితే పోయిందని చెప్పాడు. అంతటితో ఆగకుండా తన వద్ద తీసుకున్న వడ్డీ డబ్బు తిరిగివ్వాలంటూ ఒత్తిడి చేయసాగాడు. దాంతో తన బుల్లెట్ వాహనాన్ని ఇచ్చి నీ డబ్బులు నువ్వు తీసుకెళ్లమని హరిబాబు తేల్చి చెప్పేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య అప్పు రద్దు చేసుకుంటూ ఒప్పందం కుదిరింది. 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ తన బాకీ తీర్చాలంటూ హరిబాబు మీద ఒత్తిడి చేయసాగాడు. ఈ నేపథ్యంలో బుధవారం నగరంలోని రత్నమహల్ వద్ద కనిపించిన హరిబాబుపై ఉమామహేష్ మరికొందరితో కలిసి దాడి చేసి కొట్టారు. అతడి వద్ద ఉన్న మరో బుల్లెట్‌ను దౌర్జన్యంగా తీసుకొని వెళ్లారు. దీనిపై ఉమామహేష్ ముఠాను అరెస్టు చేయాలని అంజయ్య డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పెద్దపులి దాడిలో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని అచ్చంపేట సమీపంలోని నల్లమల ఫారెస్ట్‌లో పెద్దపులి దాడిలో ఎద్దు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. అచ్చంపేటకు చెందిన పాపారాయుడు అనే రైతుకు చెందిన ఎద్దు రెండు రోజుల క్రితం అడవిలోకి మేత కోసం వెళ్లింది. గురువారం అటవీశాఖ అధికారులు ఫారెస్ట్‌లోకి వెళ్లిన సమయంలో ఎద్దు మృతి చెందినట్లు గుర్తించారు. పెద్దపులి కదలికలు కడ్డీ బ్యాక్ కెమెరాలో నమోదైనట్లు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మంగి నాయక్, బీట్ ఆఫీసర్ అబ్దుల్ గఫార్‌లు తెలిపారు. గ్రామంలోకి పెద్దపులి రాకుండా భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పథకాల్లో మైనార్టీలకు తగిన ప్రాధాన్యం

● డీఆర్‌ఓ శ్రీలత



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ప్రభుత్వాలు అమలు చేసే పథకాల్లో మైనారిటీ ప్రజలు కనీసం 15శాతం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత సూచించారు. ప్రకాశంభవనంలో గురువారం జిల్లా కలెక్టర్ తరుపున డీఆర్‌ఓ మైనారిటీ సంక్షే శాఖలు అమలు చేస్తున్న ప్రధానమంత్రి 15 పాయింట్ కార్యక్రమంపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించిన మేరకు పథకాల అమలు ఉండాలన్నారు. అర్హులైన మైనార్టీలందరికీ పథకాలు తప్పనిసరిగా అందాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎన్‌జీఓ షేక్ షాకీర్, నాథనియేల్ రాజేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

● 14 రోజుల రిమాండ్

పొదిలి రూరల్: మండలంలోని మూగచింతలలో వారం రోజుల క్రితం మానసిక అంగవైకల్యం ఉన్న మహిళపై దాడికి పాల్పడిన గ్రామానికి చెందిన వేల్పుల రోహేలయ్యను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై వేమన తెలిపారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిందితునిపై నిఘా పెట్టి అతని కదలికలను గమనిస్తూ గురువారం పొదిలిలో అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితున్ని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో ఒంగోలు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు. 4 రోజుల వ్యవధిలో నిందితున్ని అరెస్టు చేసి జైలుకు పంపినందుకు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన, హెడ్ కానిస్టేబుల్ పూర్ణ, శ్రీనివాసులు, తిరుపతి నాయక్‌లను ఎస్పీ అభినందించారు.

2న మున్సిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష

ఒంగోలు: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలని యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు చావలి వెంకటరమణయ్య, జిల్లా కార్యదర్శి ఎం.బాలరాజు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణలు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబర్ 2వ తేదీన సత్యాగ్రహ దీక్షలో పెద్ద సంఖ్యలో టీచర్లు పాల్గొనాలని కోరారు. అక్టోబర్ 17వ తేదీ నుంచి డీఈఓ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 24న విద్యాశాఖ డైరెక్టరేట్ వద్ద 24 గంటలపాటు ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులు ప్రమోషన్లు, బదిలీలకు నోచుకోక ఆవేదన చెందుతున్నారని తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో వీరంగం



కత్తితో హల్‌చల్ చేస్తున్న మారెళ్ల శేఖర్

కొమరోలు: ఓ యువకుడు పూటుగా మద్యం తాగి కత్తితో వీరంగం సృష్టించిన సంఘటన కొమరోలు మండలంలోని రాజుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మారెళ్ల శేఖర్ బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో నగదు లావాదేవీల విషయంలో మాటామాటా పెరగడంతో శేఖర్ కత్తి తీసుకుని తల్లిదండ్రులపైకి దూసుకెళ్లాడు. వీధిలోనూ హల్‌చల్ చేయడంతో భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ తన సిబ్బందితో కలిసి వెళ్లి శేఖర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

ఆత్మ గౌరవం శూన్యం..
అవమానమే నిత్యం!

తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం పుట్టింది టీడీపీ అంటూ వేదికలపై తరచూ ఊదరగొట్టే ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు.. ఉద్యోగులను వీధుల్లోకి నెట్టి వారి ఆత్మగౌరవంపై దెబ్బకొట్టారన్న విమర్శలు అన్ని వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులైన సందర్భంగా అప్పగించిన బాధ్యతలు ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టాయి. ప్రభుత్వ పెద్దలు, కొందరు ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో చేస్తున్న పనులు క్షేత్ర స్థాయిలో ఉద్యోగులను ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.



కనిగిరిలో ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే పనిలో సచివాలయ ఉద్యోగి



ఒంగోలు 30వ వార్డులో కరపత్రం అందజేసి, స్టిక్కర్ అంటిస్తున్న ఏఎన్‌ఎం, వెల్ఫేర్ సెక్రటరీ

ఉన్నత సేవల నుంచి వీధుల్లోకి సచివాలయ ఉద్యోగులు

- నాడు ప్రతిపక్షంలో ఉండగా వెక్కిరించి.. నేడు వారే దిక్కనే స్థితికి..
- ఒకటో తేదీ నూరు శాతం పింఛన్ల పంపిణీ వారి దయే..
- ఇళ్లకు స్టిక్కర్లు అంటించే పనిపై ఉద్యోగుల్లో మనోవేదన

కనిగిరి రూరల్:

గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు సచివాలయ వ్యవస్థపై ఇష్టారీతిగా విమర్శలు గుప్పించారు. వారికి బీజేపీ, జనసేన నేతలూ వంతపాడారు. సచివాలయాలు ఎందుకు? అవి అసలు ఉద్యోగాలే కావంటూ అవహేళన చేశారు. అయితే, ఆ సచివాలయాల ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడ నెలలుగా మొదటి రోజే 95 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం వెనుక ఉన్నది సచివాలయ ఉద్యోగుల కష్టమే అనేది జగమెరిగిన సత్యం.

సేవలు కుదింపు.. పనిభారం పెంపు

గత ప్రభుత్వంలో జిల్లాలోని 38 మండలాల్లో 719 గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. మొత్తం 7200 మంది వరకు ఉద్యోగులు ప్రజలకు సేవలందిస్తున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు.. సచివాలయ ఉద్యోగులను కూర్చోబెట్టి జీతాలిస్తున్నారంటూ విపరీత వ్యాఖ్యలు చేశారు. ఈ సంగతి కాస్త పక్కనపెడితే.. ఇటీవల ఎన్నికల్లో ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాయాల్లో సేవల సంఖ్యను కుదించింది. మళ్లీ సేవా కేంద్రాలు, సర్వీస్ సెంటర్లు అంటూ కొత్త రాగం తీసింది. సచివాలయ ఉద్యోగులను మాత్రం వీధుల్లోకి నెట్టి స్టిక్కర్లు అంటించాలని ఆదేశాలిచ్చింది.

ఆత్మగౌరవాన్ని కాపాడని ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రభుత్వ శాఖలపై, క్షేత్ర స్థాయిలో ప్రజల స్థితిగతులపై అవగాహన కలిగిన సచివాలయ ఉద్యోగులను ఎలా వినియోగించుకోవాలనే విషయమై శాస్త్రబద్ధంగా ఆలోచించాల్సిన ప్రభుత్వం.. అదేమీ లేకుండా స్టిక్కర్లు అతికించే పనికి వారిని వినియోగించడంపై ప్రజల నుంచీ విమర్శలు వెల్లువెత్తున్నాయి. స్టిక్కర్లు అంటించేందుకు వెళ్తుండటంతో ప్రజల్లో తమపై చులకనభావం ఏర్పడిందని సచివాలయ ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు సచివాలయ ఉద్యోగులతో రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, నూతన ఆరోగ్య శ్రీ కార్డు ఒక్కటంటే ఒక్కటి కూడా పంపిణీ చేయించలేదు.

ఆది నుంచీ వ్యతిరేక వైఖరే..

కూటమి ప్రభుత్వంలోని రాజకీయ నేతలు ఆది నుంచి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థపై వ్యతిరేక వైఖరినే అవలంబించారు. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం,, సచివాలయ ఉద్యోగులను చులకన భావంతో చూస్తోందన్న అపవాదును వంద రోజుల్లోనే మూటగట్టుకుంది. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేసి ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే గుర్తించాలని వలంటీర్లను, స్థానిక ప్రజాప్రతినిధులను ఇంటింటికీ పంపి వివరాలు సేకరించి, ఆ ఇంటి యజమాని అంగీకారంతో కరపత్రాన్ని అందజేసి ఇంటి గోడకు స్టిక్కర్ అంటించే కార్యక్రమం చేపట్టింది. దీనిని అప్పుడు విమర్శించిన వారంతా.. అధికారంలోకి రాగానే ఉద్యోగులను అలాంటి పనులకు వినియోగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ప్రజలకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాజకీయ ప్రచార కార్యక్రమాలకు వినియోగించడం ఎంతవరకూ సమంజసమన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.జిల్లాలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సమయంలో ఇంటింటికీ తిరిగి వైద్య సేవలు అందించాల్సిన వైద్య సిబ్బందిని సైతం కరపత్రాలు పంచేందుకు, స్టిక్కర్లు అంటించేందుకు వినియోగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఒంగోలు 30వ డివిజన్‌లో స్టిక్కర్లు, కరపత్రాలతో వెళ్తున్న సచివాలయ ఉద్యోగులు(అడ్మిన్, రెవెన్యూ, వెల్ఫేర్, శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీస్, ఎడ్యుకేషన్, డేటాప్రాసెసింగ్ సెక్రటరీలు, మహిళా పోలీస్, ఏఎన్‌ఎం)

పట్టుకుంటారు...వదిలేస్తారు



వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద ఆపిన ఇసుక ట్రాక్టర్లు



కలికవాయ రోడ్డు వద్ద ఇసుక పట్టుకున్న ట్రాక్టర్లు

- పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా
- సహకరిస్తున్న రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ

సింగరాయకొండ: సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో ఇసుక మాఫియా అధికారుల కనుసన్నల్లో మూడు లారీలు..ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా నడుస్తోంది. వివరాల్లోకి వెళితే.. సింగరాయకొండ మండలంలో గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో శానంపూడి రోడ్డు, కలికవాయ రోడ్డు నుంచి అక్రమంగా ఇసుక ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు 100కు సమాచారం అందించారు. కానీ స్థానిక పోలీసులు మాత్రం ఫిర్యాదు చేసిన వారికే ఫోన్ చేసి ట్రాక్టర్లు ఎక్కడ అని ఎదురు ప్రశ్నిస్తున్నారని విస్మయం వ్యక్తం చేశారు. అలాగే నందనవనం- కలికవాయ రోడ్డులో సుమారు 7 గంటల సమయంలో నందనవనం సమీపంలోని పశువులకు చెందిన గోకులం షెడ్డు సమీపంలో ఏపీ 39టీఎఫ్ 1879 కారులో అధికారి వచ్చి ట్రాక్టరు ఆపి మాట్లాడి వెళ్లిపోయారు. అసలు ఆ అధికారి ఎవరో తెలియని పరిస్థితి. అదే విధంగా జరుగుమల్లి మండలం వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద జరుగుమల్లి తహసీల్దార్ బి.జనార్దన్ 5 ఇసుక ట్రాక్టర్లు ఆపారు. తరువాత ఏమైందో తెలియదు గాని వాటిని వదిలేశారు. అదే సమయంలో అడ్డరోడ్డు వద్ద యాక్సిడెంట్ జరిగింది. ఆ సమయంలో పోలీసులు అక్కడకు వచ్చినా ట్రాక్టర్ల గురించి పట్టించుకోలేదు. బుధవారం రాత్రి కూడా తహసీల్దార్ జనార్దన్ ట్రాక్టర్లను పట్టుకొని వదిలేశాడని, ఎందుకు పట్టుకుంటున్నారో..ఎందుకు వదిలేస్తున్నారో అర్థం కావడం లేదని ట్రాక్టర్ డ్రైవర్లు చెప్పుకుంటున్నారు. రెండు మండలాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్షించి, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం శ్రీ పథకం కింద చేపడుతున్న పనులు, నిధులు తదితర వివరాలను కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి దశలో చేపట్టిన పనులను అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎంలు, ఎంఈఓలు సమన్వయంతో పనులను పర్యవేక్షించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈఓ సుభద్ర, డీవైఈఓ సామా సుబ్బారావు, సమగ్ర శిక్ష డీఈ నమ్మయ్య, ఏపీఓ మాధవీలత, డీసీడీఓ ప్రమోద, ఏఎంఓ రమేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు శ్రీనివాసరావు వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొత్తపట్నం: మనస్తాపంతో పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పాదర్తి గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కొన్నె శ్రీనివాసరావు(61) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చాడు. శ్రీనివాసరావు కుమారుడు పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడు. దీంతో బయటకు వెళ్లి బీడీలు తీసుకురమ్మని చెప్పగా..వెళ్లకుండా తండ్రిని లెక్కలేకుండా మాట్లాడాడు. ఆ తరువాత కుమారుడు బయటకు వెళ్లి కూల్‌డ్రింక్ తెచ్చుకొని కొంత తాగి ఇంట్లో ఉంచాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి వచ్చి ఇంట్లో మిగిలిన కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగాడు. కొద్దిసేపటికి పొలం పనుల నుంచి ఇంటికి వచ్చిన భార్యకు పురుగుమందు తాగిన విషయాన్ని చెప్పాడు. ఆమె వెంటనే 108కు సమాచారం ఇచ్చి..వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై సుధాకర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రోచెట్స్ ప్రదర్శనలో స్వాప్నిక బృందం గిన్నిస్ రికార్డు



గిన్నిస్ రికార్డు ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న స్వాప్నిక

మార్కాపురం: క్రోచెట్స్ తయారీలో మార్కాపురానికి చెందిన మహిళల బృందం అరుదైన ఘనత సాధించింది. మార్కాపురం పట్టణానికి చెందిన కొండెపోగు స్వాప్నిక రాజ్లీ ఆధ్వర్యంలోని మహిళల బృందం నిర్ణీత వ్యవధిలో అధిక మొత్తంలో క్రోచెట్స్ తయారు చేసి గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సంపాదించారు. మహిళా మనోవికాస్ క్రాఫ్ట్స్ అండ్ క్రియేషన్స్ సంస్థ నిర్ణీత వ్యవధిలో అత్యధిక కళాకృతులు చేయాలని నిర్దేశించగా.. స్వాప్నికా రాజ్లీ బృందం 58,112 చతురస్రాకార క్రోచెట్స్ రూపొందించారు. ఈ నెల 22వ తేదీన విశాఖపట్నంలోని వెంకోజిపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో క్రోచెట్స్‌ను ప్రదర్శించారు. స్వాప్నిక బృందానికి మహిళా మనోవికాస్ సంస్థ వ్యవస్థాపకురాలు సూరెభట్ల మాధవి, గిన్నిస్ బుక్ లండన్ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ ప్రశంస పత్రాలు అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్వాప్నిక గురువారం స్థానిక పాత్రికేయులకు వివరించారు. దూపాడు పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న స్వాప్నిక.. తోటి సభ్యులు, కుటుంబ సహకారం తోనే గిన్నిస్ బుక్ రికార్డు సాధించానని పేర్కొన్నారు.

అక్టోబర్ నుంచి ఐఐటీ-నీట్ శిక్షణ



గురుకుల పాఠశాలను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వచ్చే నెల నుంచి ఐఐటీ-నీట్ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు రాష్ట్ర సాంఘిక, సర్వక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి గురువారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఐఐటీ-నీట్ శిక్షణను 80 మంది విద్యార్థినులకు అందిస్తామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పైలెట్ ప్రాజెక్టుగా డిగ్రీ కాలేజీని ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది గురుకుల విద్యార్థులు 40 మంది నీట్‌లో సీట్లు సాధించారని ప్రశంసించారు. విద్యుత్, కోతుల సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాకల బీచ్‌లో వసతులు కల్పిస్తామని చెప్పారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్, జిల్లా కో ఆర్డినేటర్ జయ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

అంతర్జాతీయ 'స్టోనా'లో ఎమ్మెల్యే బూచేపల్లి



రాజస్థాన్ పరిశ్రమల శాఖ మంత్రితో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దర్శి: ఇటలీలో జరిగిన అంతర్జాతీయ స్టోనాలో దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. స్టోనాలో జరిగిన అంతర్జాతీయ గ్రానైట్ రకాలను పరిశీలించారు. రాజస్థాన్ పరిశ్రమల శాఖ మంత్రి కే కే విశ్నోయ్‌తో కలిసి ఈ స్టోనాలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. స్టోనాకు ఇతర దేశాల నుంచి అనేక మంది ప్రముఖ గ్రానైట్ వ్యాపారులు హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి



చికిత్స పొందుతున్న సుందరరావు

యర్రగొండపాలెం: వీధుల్లో అల్లరి చేస్తున్నారని మందలించడంతో వైఎస్సార్ సీపీ నాయకుడు కొర్రపోలు సుందరరావుపై టీడీపీ వర్గీయులు దాడి చేశారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానిక ఇజ్రాయిల్‌పేటకు చెందిన టీడీపీ వర్గీయులు చేదూరి వెంకట్, కన్నా, కిషోర్, లారెన్స్‌లతో పాటు మరికొంతమంది తమ బైక్‌లు వీధుల్లో అడ్డంగా పెట్టి రాత్రి 12 గంటల వరకు అల్లరి చేస్తుండటంతో మంచి పద్ధతి కాదని సుందరరావు మందలించాడు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక బస్టాండ్ దగ్గర మరొకరితో బైక్‌పై వెళ్తున్న సుందరరావును నిలిపి దాడి చేశారు. అతని ఫోన్‌ను సైడ్ కాలువలో పడేశారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. గాయాలపాలైన సుందరరావు స్థానిక ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

దశలవారీ ఆందోళనకు విద్యుత్ సిబ్బంది

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని విద్యుత్ సిబ్బంది దశలవారీ ఆందోళనకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్-1104 కనిగిరి డివిజన్ కార్యదర్శి సీహెచ్ హరికృష్ణ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు సిబ్బంది పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది బదిలీల్లో నిబంధనలు పాటించకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని కూడా తెలిపారు. అధికారులు ఇష్టారీతిన బదిలీలు చేపట్టి నిజాయితీగా ఉండే సిబ్బందిని ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియారిటీ జాబితాలో జరిగిన అవకతవకల వల్ల అర్హులైన సిబ్బంది కూడా నష్టపోయారన్నారు. బదిలీల్లో అక్రమాలపై కనిగిరి ఈఈ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అధికారులకు ఇప్పటికే సమ్మె నోటీసులు కూడా ఇచ్చామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసులు మృతదేహం

జరుగుమల్లి(సింగరాయకొండ): గుర్తు తెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో సింగరాయకొండకు చెందిన బక్కమంతుల శ్రీనివాసులు(50) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరుగుమల్లి మండలం వావిలేటి అడ్డరోడ్డు వద్ద ఉన్న సర్వీసు రోడ్డుపై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..జరుగుమల్లి నుంచి టంగుటూరు వైపు మోటారుసైకిల్ పై సర్వీసు రోడ్డు గుండా శ్రీనివాసులు, అతని స్నేహితుడు వెళుతుండగా ఎదురుగా సర్వీసు రోడ్డులో వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఇద్దరు రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా, అతని స్నేహితునికి తీవ్ర గాయాలు కావడంతో 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ శశిధర్‌రెడ్డి తెలిపారు. సంఘటనా స్థలాన్ని సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్ తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హరదీప్.. ఎక్కడున్నావ్?



పోలీసు జాగిలాలతో గాలింపు

మార్కాపురం: వైద్య విద్యార్థి హరదీప్ క్షేమంగా తిరిగిరావాలని తల్లిదండ్రులు రవికుమార్, సుమ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏలూరు ఆశ్రమ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చింతగుంట హరదీప్ గత ఆదివారం తన మిత్రులతో కలిసి అల్లూరి జిల్లాలోని మారేడుమిల్లి జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లి నీటి ప్రవాహంలో గల్లంతైన విషయం తెలిసిందే. అతని ఆచూకీ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. గురువారం రంపచోడవరం ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి స్వయంగా అక్కడే ఉండి యాంటీ నక్సల్స్ స్క్వాడ్ బృందం, పోలీసు జాగిలాలు, గజ ఈతగాళ్లు, డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. గురువారం రాత్రి వరకు కూడా హరదీప్ జాడ తెలియలేదు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మరియబాబు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఎదురుగా వస్తున్న యువకుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో రాగసముద్రానికి చెందిన రావూరి మరియబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.